క్లుప్తంగా

వర్షంలోనే వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై నరసింహ మూర్తి

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో రూరల్ పోలీసులు మంగళవారం వర్షంలోనే వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నరసింహమూర్తి మాట్లాడుతూ గతంలో బకాయి ఉన్న వాహనదారుల దగ్గర నుంచి ఫైన్లు వసూలు చేయడంతో పాటు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

తుపానుతో అపరాల పంటలకు నష్టం



గిరిజనులు వేసిన ఉలవ చేను

సాలూరు రూరల్: కొద్ది రోజులుగా తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆరుతడి పంటలుగా వేస్తున్న అపరాలుకు తీరని నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఉలవ, పెసర, మినుము పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా గిరిజన రైతులు ఖరీఫ్ సీజన్ పూర్తి కాగానే అపరాలు వేస్తారు. ఈ ఏడాది మండంలో అపరాలు వేసిన రైతులు మాట్లాడుతూ ఇలాగే వర్షాలు కురిస్తే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని భయాందోళన చెందుతున్నారు.

28 నుంచి ఏపీజీవీబీ లావాదేవీలకు అంతరాయం

సాలూరు: ఈ నెల 28 నుంచి 31 వరకు సాంకేతిక సమస్యల కారణంగా ఏపీజీవీబీ (ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు) లావాదేవీలకు అంతరాయం కలుగుతుందని పాచిపెంట బ్యాంకు మేనేజర్ అంబటి సునీల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాచిపెంటలో ఆయన మాట్లాడుతూ, ఏపీజీవీబీ లావాదేవిలన్నీ ఆన్‌లైన్ (యుపీఐ బ్యాంకింగ్, ఏటీఎం, సీఎస్‌పీ) అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. ఖాతాదారులు ఈ విషయాన్ని గమనించి, సిబ్బందికి సహకరించాలని కోరారు.

శ్రీరంగనాథునికి ధూప్ సేవ



రామాలయంలో శ్రీరంగనాథునికి నిర్వహిస్తున్న ధూప్‌సేవ

సాలూరు: ధనుర్మాసం నేపథ్యంలో సాలూరు పట్టణంలోని పెదకోమటి రామాలయంలో శ్రీరంగనాథునికి ధూప్‌సేవను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఆలయంలో ధూప్‌సేవ తో పాటు లలితాపారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణ చేసారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పరక దొరికితే పండగే

- పస్తులుంటున్న పశువులు
- ఎండుగడ్డికి తీవ్ర కొరత
- పశుగ్రాసం కోసం రైతుల అవస్థలు



నాటుబళ్లతో తోలుకుంటున్న ఎండుగడ్డి

బలిజిపేట:

'పాడి–పంట' జనజీవనంలో విడదీయరాని అనుబంధంతో కలిసిపోయాయి. వ్యవసాయ రంగంలో ఆధునికత పెరగడంతో పాడి పశువులకు గ్రాసం(ఎండుగడ్డి) దొరకని పరిస్థితులు ఎదురవుతున్నాయి. యంత్రపరికరాల వినియోగంతో పశుగ్రాసానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. సాధారణంగా వ్యవసాయం చేసే రైతులకు పాడి సంపద కూడా తోడై ఉంటుంది. వ్యవసాయంలో దుక్కుల నుంచి పంట కోతలు, ధాన్యం రవాణా తదితర పనులను గతంలో ఎక్కువగా పశువులతోనే చేసేవారు. వాటికి తోడు పాల ఉత్పత్తికి పాడి పశువులను పెంచుకునేవారు. అందుకు పశుగ్రాసం ఎక్కువగా అవసరం ఉండేది. కాలక్రమేణా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో వ్యవసాయంలో పశువుల అవసరం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. అయితే పాలఉత్పత్తులకు మాత్రం పశువుల అవసరం ఉండడం వల్ల చాలామంది రైతులు పాడి పశువులను పెంచుకుంటున్నారు. వారికి పశుగ్రాసం కొరత ఎక్కువగా కనిపిస్తోంది.

ఎండుగడ్డికి డిమాండ్

ఆధునిక వ్యవసాయ విధానాల్లో భాగంగా నాట్ల నుంచి కోతల వరకూ యంత్రాలను ఉపయోగిస్తున్న తరుణంలో పశుగ్రాసంగా ఎక్కువగా వినియోగించే ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. పండిన పంటను కూలీల సాయంతో కోత కోయించి వాటిని పొలాలలోనే కుప్పలుగా పెట్టుకుని కొంతకాలం అయిన తరువాత రైతులు వారి కళ్లాలకు తీసుకువచ్చి నూర్పు చేసి గడ్డిని కుప్పలుగా వేసేవారు. దీనివల్ల ఎండుగడ్డికి కొరత ఉండేది కాదు. పశువులకు మేతగా వేసేవారు. ఎక్కువగా ఉండే గడ్డిని ఇతరులకు ఉచితంగా ఇచ్చేవారు. అయితే వరికోతలకు యంత్రాలు వినియోగించడం వల్ల ఎండుగడ్డి పరకలు ముక్క,ముక్కలు కావడంతో వాటిని రైతులు పంటపొలాల్లోనే వదిలేసి మంట పెట్టేస్తున్నారు. దీంతో ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. ఎక్కడైనా కూలీల ద్వారా కోతలు జరిగితే అక్కడికి పాడిరైతులు పరుగులు తీసి గడ్డిని కొనుగోలు చేసి తీసుకు వస్తున్నారు.

తప్పని పరిస్థితుల్లో కొనుగోలు

కూలీల రేట్లు ఎక్కువ. కోత కోసిన చేను తక్కువగా ఉంటోంది. కొంతవరకు కోసిన రైతులు వినియోగించుకుంటున్నారు. అందువల్ల తప్పనిసరి పరిస్థితులలో దూరాభారమైనా కొనుగోలు చేసి ఎండుగడ్డి తెచ్చుకుంటున్నాం.

– సత్యంనాయుడు, బలిజిపేట

ఎండుగడ్డికి ప్రత్యామ్నాయం లేదు

ఎండుగడ్డికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో ముక్కలైన గడ్డికి కూడా ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. ఇతర గ్రామాల్లో ఉండే ఉండే గడ్డి కోసం అక్కడికి వెళ్లి కొనుగోలు చేసి రవాణా ఖర్చులు పెట్టుకుని తెచ్చుకుంటున్నారు. ఒక నాటుబండి గడ్డి దూరాన్ని బట్టి కనీసం రూ.1,000 ఉంటోందని రైతులు చెబుతున్నారు.

ప్రజలపై కరెంట్ చార్జీల పిడుగు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని కూటమి ప్రభుత్వం వేస్తోందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురంలో గల ఆయన నివాసం వద్ద ఈ నెల 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంపోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి వైఖరికి నిరసనగా డిసెంబర్ 27న నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించనున్నామన్నారు. నాడు కరెంటు చార్జీలు పెంచబోనని హామీలిచ్చిన చంద్రబాబు నేడు మాటమార్చడం సరికాదన్నారు. అవసరమైతే చార్జీలు తగ్గిస్తానంటూ బూటకపు హామీలు గుప్పించారని విమర్శించారు. వినియోగదారులే కరెంటు అమ్మేలా చేస్తానని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని తుంగలో తొక్కారన్నారు. ఆరు నెలలు తిర్కకుండానే జనంపై చార్జీల భారం మోపుతున్నారని, అబద్ధపు వాగ్దానాలు చేసి ప్రజలతో ఓట్లేయించుకుని ఇప్పుడు ప్రజల నడ్డి విరిచారన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొంగు చిట్టిరాజు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తీళ్ల శివున్నాయుడు, కురమాన శ్రీనివాసరావు, శాస్త్రి, వైస్ సర్పంచ్ గంట రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన క్రిస్మస్ వేడుకలు



సుందరంగా తయారుచేసిన లచ్చయ్యపేట బాప్టిస్ట్ చర్చి

సీతానగరం: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం సీతానగరం మండలంలోని పలుగ్రామాల్లో చర్చిలను అంగరంగవైభవంగా విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా లచ్చయ్యపేట బాప్టిస్ చర్చి, గోస్పల్ చర్చి, అలాగే మరిపివలస, బూర్జ,నిడగల్లు, గాదెలవలస, పెదంకలాం, వెంకటాపురం, సీతానగరం, గెద్దలుప్పి తదిగతర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ పండగను రెండు రోజులు ఘనంగా నిర్వహించడానికి అనుగుణంగా నిర్వాహకులు చర్చిల్లో ఏర్పాట్లు చేశారు.

ఈకేవైసీ చేయించుకోవాలి



కాశీపేటలో ఈకేవైసీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: ప్రభుత్వం అమలు చేసిన హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయాలని, సంక్షేమ పథకాలు పొందడానికి ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు కోరారు. ఈ మేరకు మండలంలోని కాశీపేటలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న ఈ కేవైసీ, హౌస్‌హోల్డ్ సర్వే, గోశాలల నిర్మాణం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీలు పొందడానికి సాంకేతిక పరమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. నెల రోజులుగా జరుగుతున్న సర్వే కార్యక్రమానికి సహకరించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారం రెవెన్యూ సదస్సులతోనే సాధ్యం

మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యలు రెవెన్యూ సదస్సుల ద్వారానే సున్నితంగా పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వ రరావు, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని అంటిపేట, వెన్నెల బుచ్చింపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూములకు సంబంధించిన సమస్యలు, రెవెన్యూ పరమైన వివరాలను అగిడితెలుసుకోవాలని కోరారు. గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా గ్రామసభల్లో వినతులు స్వీకరిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నెలరోజుల పాటు నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో రాజరత్నం, స్థానిక పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

తడిసి ముద్దవుతున్న ధాన్యం బస్తాలు



రోడ్డుపై కప్పి ఉన్న ఉన్న ధాన్యం బస్తాలు



టార్పాలిన్‌లను ఎపంపిణీ చేస్తున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మండలంలో నూర్పు చేసిన ధాన్యం కొనుగోలుకు ట్రక్‌షీట్ తెగక, ఇంటికి చేర్చడానికి వీలుకాక పోవడంతో నాలుగు రోజులుగా కురుస్తున్న చిత్తడి వర్షానికి రైతులు నూర్పు చేసిన ధాన్యం రోడ్డుపైనే ఉంచాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వర్షాలకు ధాన్యం తడిసిపోతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ తమపొలంలో పండించిన వరిచేను కోతకోసి నూర్పిడి చేయగా వచ్చిన ధాన్యం బస్తాల్లో ఉంచామని, ధాన్యం తడవకుండా లక్ష్మీపురం– వెంకటాపురం గ్రామాలమధ్య బీటీ రోడ్డుపక్కనే కిందవేసిన పర్జాపై బస్తాల నెట్టు కట్టి వర్షానికి తడవకుండా గోనెలు, వరిగడ్డి, చెరుకు సోరు కప్పి భద్రపరుచుకున్నామని తెలియజేశారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

ధాన్యం తడవకుండా టార్పాలిన్‌ల పంపిణీ

వర్షాలు కురుస్తున్న కారణంగా కళ్లాల్లో ధాన్యం భద్రపర్చుకునేందుకు టార్పాలిన్‌లు(పర్జాలు)పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండల వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన రైతులకు టార్పాలిన్‌లు పంపిణీ చేశారు. కళ్లాల్లో ధాన్యం భద్రపర్చడానికి అవసరమైన రైతులు వచ్చి తీసుకోవచ్చని కోరారు. వాతావరణం అనుకూలించిన తరువాత ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. మరో రెండు రోజులు తుఫాన్ ఉంటుందని ఏఓ అవినాష్ చెప్పారు.

పెసా కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: స్థానిక ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో పెసా కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయంలో ఎంపీడీఓలు, తహసీల్దార్లలతో పెసా కమిటీ ఎన్నికలపై మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని 278 పెసా గ్రామసభలకు ఉపాధ్యక్షులు, కార్యదర్శి పదవులకు 2025 జనవరి 2 నుంచి 6వ తేదీ వరకు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. పెసా గ్రామాలలో, ఆవాసాలలో నివసిస్తున్న గిరిజనులకు, ఇతర ప్రజలందరికీ ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పార్టీలకు అతీతంగా జరగబోయే ఈ ఎన్నికల్లో గిరిజనులు ఎవరైనా పోటీ చేయవచ్చని, ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా గిరిజనులను ప్రోత్సహించాలని, గెలిచిన అభ్యర్థుల పదవీకాలం ఐదేళ్లు ఉంటుందన్నారు. కావున ఈ ఎన్నికలపై 278 పెసా గ్రామాల్లో, ఆవాసాల్లో అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ఎన్నికలు జరగనున్న ప్రదేశం, ఎన్నికల తేదీ, సమయం తదితర వివరాలను గ్రామ సభ సభ్యులందరికీ తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయక ప్రాజెక్టు అధికారి పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఈ చలానాల వసూలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై ఎం. రాజేష్

సీతానగరం:

మండలంలో జోరుగా వర్షం కురుస్తున్నా పోలీసులు వాహన యజమానుల నుంచి ఈ చలానాలు కట్టిస్తున్నారు. ఒకపక్క వర్షం, ఇంకో పక్క క్రిస్మస్ పండగ అయినప్పటికీ ఎస్సై ఎం.రాజేష్ మంగళవారం హనుమాన్ జంక్షన్ వద్ద వాహనాల నంబర్లను చూసి పెండింగ్‌లో అపరాధరుసుం తక్షణమే ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని వాహనదారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న అపరాధరుసుం ఆన్‌లైన్‌లో లేదా ఫోన్‌పేద్వారా చెల్లించాలని కరాఖండిగా చెప్పడంతో వేరేదారిలేక వాహన యజమానులు పెండింగ్‌లో ఉన్న ఈ చలానాలు చెల్లిస్తున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ చలానాలు కట్టని పక్షంలో వాహనాలను అదుపులోకి తీసుకుంటున్నామని ఎస్సై రాజేష్ అన్నారు. అలాగే బొలెరో, ఇతర కార్లు, మ్యాక్సీలు అపరాధరుసుం చెల్లించాల్సి ఉందని ఆయా నంబర్లను అనుసరించి తనిఖీలు చేయనున్నట్లు చెప్పారు. బాకీపడిన ఈ చలానాలను వాహనాల యజమానులు తక్షణమే చెల్లించి పోలీసు వారికి సహకరించాలని కోరారు.

రైతు గుండెల్లో తుఫాన్



ధాన్యం ఆరబెడుతున్న రైతులు



మొలకల ధాన్యం చూపిస్తున్న గిరిజన రైతు



- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వర్షాలు
- మొలకలు వస్తున్న వరికుప్పలు
- తినడానికి, అమ్మడానికి పనికిరావని అయోమయంలో రైతు
- నష్టాన్ని అంచనావేసే నాథుడే కరురంటూ ఆవేదన



కరకవలసలో నేలకొరిగిన వరిచేను

సాలూరు రూరల్: విపత్తుల సమయంలో పంటనష్టాలను పర్యవేక్షించి ఏ రైతు ఏ పంట ఎంతమేరకు నష్టపోయాడో ప్రభుత్వం అధికారులతో లెక్కలు వేయిస్తుంది. అయితే ప్రస్తుతం సాలూరు మండలంలో పంటకోసి నష్టపోయిన రైతులు కొంతమంది అయితే, మరికొంతమంది రైతులు పొలంలోనే వరిచేలు కుప్పలు వేయడంతో వర్షానికి అవి తడిసి ముద్దయి మొలకలు వస్తున్నాయి. అలాగే మరో వైపు కోయకుండా పొలాల్లో ఉన్న చేలు నేలకొరిగి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది వలంటీర్లు కలిసి గ్రామాల్లో రైతుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి రైతులను ఆదుకునే ప్రయత్నం చేసే పరిస్థితి ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం కనీసం అధికారులను పొలం గట్టు వైపు కూడా చూసేవిధంగా చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

తమ చేలు కుప్పలు వేస్తే అవి పొలంలో తడిసి ముద్దవుతుంటే తమ వద్ద ఉన్న చిన్నచిన్న టార్పాలిన్లతో కప్పి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామని అయినా తడిచిన కుప్పల్లో ధాన్యం మొలకలు వస్తున్నాయని వాపోతున్నారు.

గిరిజన రైతులకు అందని టార్పాలిన్లు

కురుకూటి పంచాయతీ బట్టివలస గ్రామంలో గిరిజన రైతులు 32 ఎకరాల్లో వరిపంట వేశారు. అయితే తుఫాన్‌కు ముందే కోతలు కోసి కుప్పలు వేయగా ఐదుగురు రైతులు మాత్రమే నూర్పి ధాన్యం ఇంటికి చేర్చారు. ఈ లోగా తుఫాన్ మొదలు కావడంతో అప్పటి నుంచి ఈ రోజు వరకు నూర్చేందుకు అదును కుదరలేదు. అయితే రెండు తుఫాన్‌లను అధిగమించిన రైతులు మూడో తుఫాన్‌తో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుప్పలపై కప్పిన టార్పాలిన్లు సరైనవి కాకపోవడంతో తడిసి ముద్దవుతున్నాయి. దీంతో చాలా వరకు కుప్పల్లో ధాన్యం మొలకలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తాము ఎకరా, రెండు ఎకరాలు పండించి ఏడాది పాటు వాటిపైనే ఆధారపడి జీవించే వారమని ప్రస్తుతం ఎన్ని ధాన్యం ఇంటికి చేరుతాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని గగ్గోలు పెడుతున్నారు.

60 టార్పాలిన్లు ఉన్నాయంటున్న అధికారులు

తమ వద్ద 60 టార్పాలిన్లు ఉన్నాయని..ఎవరికైనా కావాల్సి వస్తే వచ్చి తీసుకుని మళ్లీ ఆఫీసులో అప్పచెప్పాలని గత తుఫాను కాలంలో ఏఓ ప్రకటన ఇచ్చారు. అయితే ఇలాంటి ప్రకటనలు గిరిజనుల వరకు చేరాలంటే స్థానిక సచివాలయ వ్యవస్థ పనిచేస్తే తప్ప ప్రయోజనం ఉండదు. గత ప్రభుత్వంలో గిరిజన రైతులకు పెద్ద టార్పాలిన్లు ఇచ్చేవారని రైతులే చెబుతున్నారు.

మిగిలిన చేలు నేలకొరిగాయి

ఇదిలా ఉండగా సోమవారం, మంగళ వారం కురిసిన వర్షాలకు ఇంకా పంటపొలాల్లో మిగిలి ఉన్న చేలు దాదాపుగా నేలకొరిగాయి. అలాగే పొలాల్లోనే .కుప్పలు వేసి కప్పిన ధాన్యం మడుల్లో నీరు చేరడంతో అక్కడి నుంచి మళ్లీ ఎత్తు ప్రాంతాలకు నాటుబళ్లతో అతి కష్టం మీద బయటకు తీసుకువస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి కనీస చర్యలు తీసుకోవడం లేదని, అలాగే అధికారులు పరిస్థితిని తెలుసుకునేందుకు కూడా ప్రయంత్నించడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో అందిన టార్పాలిన్లు



గత ప్రభుత్వంలో తుఫాన్ సమయంలో పండిన పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్లు అందజేశారు. ప్రస్తుతం మూడు తుఫాన్‌లు వచ్చినా ఇంతవరకు ఒక్క టార్పాలిన్ కూడా మా గ్రామ రైతులకు అందించలేదు. దీంతో వరి కుప్పలు తడిచి ధాన్యం మొలకలు వస్తున్నాయి.

– సుంకరి జాను, రైతు, బట్టివలస కురుకూటి పంచాయితీ

ప్రభుత్వమే ఆదుకోవాలి



పండిన పంట అంతా కుప్పల్లో ఉండిపోయింది. వర్షం తగ్గితే నూర్చాలని చూస్తున్నాను. ఇప్పటికే మొలకలు వచ్చాయి. తినడానికి, అమ్మడానికి పనికి రావు ప్రభుత్వమే ఆదుకోవాలి. ఇప్పటివరకు ఏ అధికారీ రాలేదు.

– కొర్ర తవుడు గిరిజన రైతు బట్టివలస